



ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మహబూబాబాద్

మంగళవారం 28 అక్టోబరు 2025 | 5



'ఔట్‌సోర్సింగ్' అక్రమార్కులకు చెక్

- కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పేరిట ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రుల్లో తిష్ట
- అనుమతులు లేకున్నా ఇష్టారాజ్యంగా ఔట్‌సోర్సింగ్‌లో భర్తీ
- లేని ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నట్లుగా కొన్ని ఏజెన్సీల బురిడీ
- నకిలీల పేరుతో కోట్లు కొల్లకొడుతున్న కేటుగాళ్లు
- పీఎఫ్‌లు మాయం.. ఆరేడు నెలలకు ఒకసారి వేతనాలు
- అర్హులైన ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను గుర్తించే పనిలో సర్కారు
- ఉమ్మడి జిల్లాలో 25 వేల మందికి పైగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు



ప్రభుత్వ శాఖల్లో బోగస్ ఉద్యోగులపై ప్రభుత్వం నజర్

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ప్రభుత్వ కార్యాలయాలు, అస్పత్రుల్లో తిష్ట వేసిన నకిలీ ఉద్యోగులపై సర్కారుపై దృష్టి పెట్టింది. ఉద్యోగులు లేకున్నా.. ఉన్నట్లుగా బోగస్ రికార్డులు చూపించి వేతనాలు డ్రా చేసుకుంటున్న ఏజెన్సీలు ఉన్నాయి. పని భారం తగ్గించుకునేందుకు అనవసరంగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కొంతమంది అధికారులు బినామీ ఉద్యోగులను నియమించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో కోట్లాది రూపాయలు వేతనాల రూపంలో పక్కదారి పడుతున్నట్లుగా ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో నకిలీ ఉద్యోగులపై నజర్ వేసింది. నకిలీలను గుర్తించేందుకు ఆయా ఉద్యోగుల ఆధార్ కార్డు, బ్యాంకు, పాన్‌కార్డు తదితర వాటిని సమర్పించాల్సిందిగా ఆయా శాఖల ఉన్నతాధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో బినామీ పేర్లతో ఏళ్ల తరబడి కోట్లు కొల్లగొట్టిన ఏజెన్సీల్లో గుబులు షురువైంది.

కార్యాలయాల్లో ఔట్ సోర్సింగ్ సేవలు

ప్రభుత్వ అస్పత్రులతో పాటు కార్యాలయాల్లో సిబ్బంది కొరతను తీర్చేందుకు ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ విధానంలో ఏజెన్సీల ద్వారా ఉద్యోగ నియమాకాలు చేపడుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వైద్యశాఖతో పాటు రెవెన్యూ, మునిసిపాలిటీ, కార్పోరేషన్‌లు, విద్యాశాఖ, పంచాయతీరాజ్, మహిళ, శిశు సంక్షేమ శాఖ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, డీఆర్‌డీఏ తదితర శాఖలతో పాటు వరంగల్ ఎంజీఎం, సీకేఎం అస్పత్రులు, అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 25వేల మందికి పైగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారని అంచనా.

ఆయా శాఖల్లో ఏళ్ల తరబడి ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవటం, కావాల్సినంత రెగ్యులర్ ఉద్యోగులు లేకపోవటంతో తాత్కాలిక ప్రతిపాదికన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వీరిలో ఎక్కువగా కంప్యూటర్ ఆపరేటర్లు, జూనియర్ అసిస్టెంట్లు, స్వీపర్లు, స్టాఫ్ నర్సులు, ఆశ వర్కర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, డ్రైవర్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఆయాలు తదితర విభాగాల్లో పొరుగు సేవలు అందిస్తున్నారు. వీటిలో అత్యధికంగా వైద్యశాఖలోనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. అయితే వీరిలో వరంగల్ నగరంలోనే 70శాతం మంది పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు దీటుగా సేవలు అందిస్తున్నప్పటికీ అరకొర వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఔట్‌సోర్సింగ్‌తో అక్రమ దందా

ప్రభుత్వం ప్రతీ నెలా కోట్లాది రుపాయలు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాల రూపంలో చెల్లిస్తోంది. అయితే అనేక కార్యాలయాల్లో అవసరానికి మించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉండటం.. ఉద్యోగులు లేకున్నా ఉన్నట్లుగా బినామీ రికార్డులు సృష్టించి కోట్లాది రుపాయలు వేతనాల రూపంలో విత్‌డ్రా చేసుకుంటున్న సంఘటనలు వెలుగులోకి

(మిగతా 7లో..)

లక్కీచాన్స్

- ప్రశాంతంగా మద్యం దుకాణాలకు డ్రా
- డ్రా తీసిన కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్
- జిల్లా వ్యాప్తంగా 61 షాపులకు 1,792 దరఖాస్తులు
- కొత్తవారికి దక్కిన పలు షాపులు
- ఆశావహులతో కిటకిటలాడిన ఏబీ ఫంక్షన్ హాలు

నెహ్రూసెంటర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 61 మద్యం దుకాణాలకు డ్రా ప్రశాంతంగా ముగిసింది. 2025-27 రెండేళ్ల కాల పరిమితికి కొత్త లైసెన్స్ దారులను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సోమవారం ఎక్సైజ్‌శాఖ అధికారులు లక్కీడ్రా ద్వారా ఎంపిక చేశారు. మానుకోట పట్టణంలోని ఏబీ ఫంక్షన్‌హాల్లో వీడియో చిత్రీకరణ నడుమ లక్కీడ్రాను నిర్వహించారు. ఏబీ ఫంక్షన్‌హాల్లో ఉదయం 11 గంటల ప్రారంభమైన లక్కీడ్రా కార్యక్రమం మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగింది. ఏబీ ఫంక్షన్‌హాల్‌తో పాటు పరిసరా ప్రాంతాలు దరఖాస్తుదారులతో కోలాహలంగా జనసంద్రంగా మారింది. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన మద్యం షాపుల లక్కీ డ్రాలో ఈ సారి అధిక సంఖ్యలో కొత్త వారినే ఆదృష్టం వరించింది. కాగా, జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు, 18 మండలాల పరిధిలో 61 మద్యం దుకాణాలు ఉండగా వాటిని దక్కించుకునేందుకు 1792 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో 61 మందికి లక్కీడిప్ ద్వారా షాపులు దక్కగా, మిగతా వారు నిరాశతో వెనుదిరిగి వెళ్లారు.



మానుకోటలోని ఏబీ ఫంక్షన్‌హాల్లో మద్యం దుకాణాలకు డ్రా తీస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

పారదర్శకంగా దుకాణాలకు టెండర్లు : కలెక్టర్

జిల్లాలోని 61 మద్యం షాపులకు లక్కీ డ్రా పారదర్శకంగా నిర్వహించామని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మద్యం దుకాణాలు నిర్వహించుకునేందుకు డిసెంబర్ 1వ తేదీ నుంచి నూతన లైసెన్స్‌లతో మద్యం దుకాణాలు కొనసాగుతాయని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారంమే షాపులను నిర్వహించాలని ఆదేశించారు. షాపులకు సంబంధించిన లైసెన్స్ ఫీజులు చెల్లించాలని సూచించారు.

షాపులకు మొదలైన బేరసారాలు..

మహబూబాబాద్ జిల్లాలో లక్కీడిప్ ద్వారా మద్యం షాపులు దక్కించుకున్న కొత్తవారి నుంచి పాత వ్యాపారులు షాపులను కొనుగోలు చేసుకునేందుకు బేరసారాలు మొదలు పెట్టారు. ఈ సారి అధిక సంఖ్యలో షాపులు కొత్తవారిని ఆదృష్టం వరించడంతో గతంలో షాపులను నిర్వహించిన వారు వాటిని దక్కించుకునేలా ప్రయత్నాలు ఆరంబించారు. ఎవరికి షాపులు వచ్చాయి.. వారు నడిపిస్తారా.? లేక అమ్ముతారా! అని ఆరా తీస్తున్నారు. దాదాపుగా ఒక్కొషాపు రూ. కోటి పలుకుతుందన్న చర్చ జరుగుతుండడంతో షాపులను దక్కించుకున్న కొత్తవారిలో కొంతమంది అమ్మేం దుకు మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది.



లక్కీడ్రా కార్యక్రమానికి హాజరైన దరఖాస్తుదారులు

దరఖాస్తులు తగ్గినా, పెరిగిన ఆదాయం..

జిల్లాలో గతంతో పోలిస్తే దరఖాస్తులు తగ్గినప్పటికి వాటి ద్వారా వచ్చిన ఆదాయం మాత్రం గణనీయంగా పెరిగింది. 2023-25 సంవత్సరాలకుగాను 59 మద్యం షాపులకు 2,589 దరఖాస్తులు రాగా, తద్వారా రూ.51.78 కోట్లు ఆదాయం సమకూరింది. ఈ ఏడాది రెండుషాపులు పెరిగినప్పటికి 61 షాపులకు దరఖాస్తులు మాత్రం గతం కంటే తక్కువగా 1792 మాత్రమే వచ్చాయి. అయితే గతంలో దరఖాస్తు రుసుము రూ.2 లక్షలు ఉండగా ఈ సారి ప్రభుత్వం దానిని రూ.3 లక్షలు చేయడంతో దరఖాస్తులు తగ్గినప్పటికి ఆదాయం మాత్రం 53.76 కోట్లు వచ్చింది.

షాపులు దక్కించుకున్న వారు వీరే..

మానుకోట మునిసిపాలిటీ పరిధిలోని షాప్-1 పెరుమాండ్ల వెంకన్న, నలమాస రాంబాబు-2 కొలిపాక రజిత-3,

(మిగతా 8లో..)

పంటనష్టం జరుగకుండా జాగ్రత్తలు పాటించాలి

- ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఓపెన్ చేయాలి
- మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తమ్మల నాగేశ్వర్‌రావు

మహబూబాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తుపాను కారణంగా అకాల వర్షాలతో పంటనష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు పాటించాలని పౌరసరఫరాల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. హైదరాబాద్ నుంచి పత్తి, ధాన్యం, మొక్క జొన్నపంటల కొనుగోలుపై సోమవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు సిద్ధం చేయాలన్నారు. నిర్దేశించుకున్న ప్రకారం వంద శాతం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఓపెన్ చేయాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బంది లేకుండా సజావుగా పంటల కొనుగోలు జరిగేలా చూడాలన్నారు. రాష్ట్రమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ తుపాన్ ప్రభావంతో రాబోయే రెండు రోజుల్లో తూర్పు తెలంగాణ ప్రాంతంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున, పంటకోతలు వాయిదా వేయాలని సూచించారు. మార్కెట్‌కు వచ్చిన పంట అకాల వర్షాలకు తడవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీసీలో రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు, మానుకోట నుంచి జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, జిల్లా అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్, జిల్లా అధికారులు మధుసూదనరాజు, వెంకటేశ్వర్లు, కృష్ణవేణి, ప్రేమ్‌కుమార్, విజయనిర్మల, విజయ పాల్గొన్నారు.

మానుకోట ఎంపీడీవోగా సుష్మిత బాధ్యతలు

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)గా గోపిశెట్టి సుష్మిత సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఖమ్మం జిల్లా తల్లాడ పట్టణానికి చెందిన సుష్మిత గ్రూపు-1 ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించి, ఎంపీడీవోగా నియామకమై విధుల్లో చేరిన ఆమెకు జడ్పీ సీఈవో పురుషోత్తంకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన సుష్మితకు ఎంపీవో రఘుపతిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

మానుకోటను రోల్‌మోడల్‌గా నిలుపుదాం

- బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే సర్కార్ లక్ష్యం
- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మానుకోట మునిసిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, రాష్ట్రంలో రోల్‌మోడల్‌గా నిలుపుదామని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యమని పేర్కొన్నారు. మానుకోట మునిసిపాలిటీకి రూ.59.62 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడాన్ని హర్షిస్తూ స్థానిక తహసీల్ కార్యాలయం ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ పోరిక బలరాంనాయక్ ఫ్లెక్సీకి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం మానుకోట మునిసిపాలిటీకి రూ. 50 కోట్లు మంజూరీ చేశామని ఫైలాన్ కట్టి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. పట్టణాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. రూ.59.62 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, పార్కుల అభివృద్ధి, ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. పాఠశాలల మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర సర్కార్ ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. మానుకోటను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది

(మిగతా 8లో..)

పేదలకు అండగా ప్రభుత్వం

నెల్లికుదురు : అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే మురళీనాయక్ తెలిపారు. నెల్లికుదురులోని రైతు వేదికలో లబ్ధిదారులకు 34 కల్యాణలక్ష్మీ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లికుదురు మండలంలోని అన్ని గ్రామాలకు తండాలకు నిధులు విడుదలచేసి అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద నరేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

మహబూబాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనంతో బలపడుతున్న తీవ్ర తుపాన్‌తో మానుకోట జిల్లాకు అతి భారీ వర్ష సూచన ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో తెలంగాణకు భారీ వర్షసూచన బుధవారం ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ జిల్లాలకు అతిభారీ వర్షసూచన ఉందని చెప్పారు. మొంథా తుపాన్‌తో జిల్లాలో మొక్కజొన్న, పత్తి తదితర పంటలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉపేందర్

8

ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి ముప్పు

మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి హాని కలుగుతుందని మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్ అన్నారు. మహబూబాబాద్ వర్తక సంఘం భవనంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై కిరాణ, హోటల్స్, నాన్‌వెజ్ వ్యాపారులతో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లడమే కాకుండా, భవిష్యత్ తరాలకు హాని కలిగించే ప్రమాదముందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించిన 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను వాడకుండా జూట్ బ్యాగులను వినియోగించాలని కోరారు. అందుకు భిన్నంగా వ్యవహరిస్తే జరిమానాలు విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్ కరుణాకర్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ క్రాంతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వర్

గ్రీవెన్స్ దరఖాస్తులను పరిష్కరించాలి

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి) : గ్రీవెన్స్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా పరిషత్ సీఈవో పురుషోత్తం, మానుకోట ఆర్డీవో కృష్ణవేణి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుంచి 104 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రీవెన్స్‌కు వచ్చిన దరఖాస్తులను అధికారులు పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లా అధికారులు మధుసూదనరాజు, వెంకటేశ్వర్లు, యాదగిరి, పవన్‌కుమార్, మదన్‌మోహన్, రాఘవ రెడ్డి పాల్గొన్నారు.



వినతులను స్వీకరిస్తున్న జడ్పీ సీఈవో పురుషోత్తం

దళారుల చేతిలో రైతులు మోసపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తోన్న తహసీల్దార్ సునీల్‌రెడ్డి బృందం

దంతాలపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి)ఖరీఫ్‌లో రైతులు పండించిన వరి ధాన్యంను మధ్య దళారులకు విక్రయించొద్దని వ్యవసాయాధికారి వాహిని అన్నారు. సోమవారం మండల సంబంధిత అధికారులతో కలిసి ఆమె మండల కేంద్రంలోని రైతు వేదికలో ధాన్యం కొనుగోలు, వరికోత మిషన్ల యాజమాన్యంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కోత విషయంలో మిషన్ల యాజమాన్యం తొందర పాటుతో ధాన్యంను ఆగం చేయొద్దన్నారు. రైతులు పండించిన ధాన్యంకు 17శాతం తేమ ఉండేవిధంగా ఆరబోసుకోవాలన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండి పండించిన ధాన్యంను వర్షం బారిన కాపాడుకోని విక్రయం జరపాలన్నారు. ప్రభుత్వం రూ.ఏ గ్రేడ్ వరి ధాన్యంకు రూ.2389, కాగా బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2369గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఏపీఎం, సీఈవో వెంకన్న, ఆర్ఐ రాజు, ఎస్సై రాజు, ఏఈవోలు దీక్షిత్‌కుమార్, వీరిష, ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని ఆగపేట, తూర్పుతండా, గున్నేపల్లి, కుమ్మరికుంట్ల తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు స్థలంను మండల అధికారుల బృందం పరిశీలించింది. గత యాసంగిలో ఏర్పాటు చేసిన చోటే తిరిగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని బృందం అధికారులు పేర్కోన్నారు. కాగా ఇటు పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఏవో వాహిని, ఏఈవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

●తొర్రూరు రూరల్ : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల సమాఖ్య ఏపీఎం సునీత అన్నారు. సోమవారం తొర్రూరు మండలం మడిపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతుల పండించిన పంటను దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర రూ.2389తో పాటు బోనస్ రూ.500 పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీసీ చైర్‌పర్సన్ కేతిరెడ్డి లక్ష్మీ, గ్రామ పార్టీ అధ్యక్షుడు వెన్నె సోమిరెడ్డి, పాపిరెడ్డి, అనిల్ రెడ్డి, రామలింగం, రాంరెడ్డి, వీవో అధ్యక్షురాలు మంజుల, రేణుక, సీసీ మహేందర్, రేణుక, వనిత మరియు రైతులు, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● పెద్దవంగర : దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంను విక్రియించాలని కొడకండ్ల ఏఎంసీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అండాలు శ్రీరామ్ అన్నారు. సోమరం మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేందుకు ప్రణాళికలను రూపొందించడం జరిగిందని, క్రయ విక్రయాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. రైతులు పండించిన ధ్యానానికి మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధ్యానం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. దళారులు ధాన్యం విక్రయించిన వెంటనే డబ్బులు ఇస్తామని చెప్పే మాయమాటలకు రైతులు మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏవో స్వామినాయక్, ఏపీఎం పాషా, ఏఎంసీ డైరక్టర్ ముత్యాల పూర్ణచందర్, పీఏసీఎస్ డైరక్టర్ గోపాల్, ఆర్ఐ లష్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముద్దసాని సురేష్, రంగు మురళి, పాషా, రవీందర్‌రెడ్డి, దేవేంద్ర, సైదులు, లింగమూర్తి, సంపత్, వినోద్, సాంబి, సీసీలు పాల్గొన్నారు.



మడిపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం సునీత

ఫ్లైవుడ్ వ్యాపారి ఆత్మహత్య



గడ్డం ఉప్పలయ్య (ఫైల్)

దంతాలపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో ఓ ఫ్లైవుడ్ వ్యాపారి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దంతాలపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రాజు కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన గడ్డం ఉప్పలయ్య (48) పదేళ్లుగా దంతాలపల్లిలో ఫ్లైవుడ్ షాపును నిర్వహిస్తున్నాడు. షాపులో గిరాకీలేక ఇటు తెచ్చిన అప్పులు పేరుకుపోవడంతో గత కొద్ది రోజులుగా మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం తెల్లవారు జామున ఆయన ఇంట్లో తాడు సాయంతో పైపునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు శ్రీరాం, కుమార్తె అంబిక ఉన్నారు

సోమన్న ఆలయంలో ఆగిన భక్తుడి గుండె

మృతుడు చిన్నవంగరకు చెందిన బీఆర్ఎస్ నేత





సోమారెడ్డికి సీపీఆర్ చేస్తున్న సిబ్బంది , సోమారెడ్డి(ఫైల్)

పెద్దవంగర/పాలకుర్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి దర్శనం కోసం వచ్చిన భక్తుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన సోమవారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో జరిగింది. ఆలయ అధికారులు, స్థానికుల కథనం ప్రకారం.. పెద్దవంగర మండలం చిన్నవంగరకు చెందిన పాకనాటి సోమారెడ్డి (65) కుటుంబ సభ్యులతో సోమేశ్వరాలయానికి దర్శనం కోసం వచ్చారు. గర్భగుడిలో శివుడికి అభిషేకం చేసి పక్కనే ఉన్న నర్సింహస్వామి దర్శించుకొంటున్న సమయంలో ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు, ఆలయ అధికారులు, ఎస్సై పవన్‌కుమార్‌లు సోమారెడ్డికి కార్డియో పల్మనరీ రీసెర్సీషన్ (సీపీఆర్) చేశారు. వెంటనే ఓ ప్రైవేటు వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సోమారెడ్డికి గతంలోనే గుండెకు స్టంట్ పడిందని కుటుంబ సభ్యులు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, రైతు బంధు మండల కన్వీనర్‌గా పనిచేశాడు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి



కంతాయపాలెం గ్రామంలో యాదవ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మేకల కేదార్ యాదవ్

తొర్రూరు రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా కేవీపీఎస్ సంఘం మాజీ చైర్మన్ మేకల కేదార్ యాదవ్ అన్నారు. తొర్రూరు మండలం కంతాయపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన యాదవ సింహ గర్జన , యాదవ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ యాదవులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని వారి అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేయాలన్నారు. యాదవులు ఐక్యంగా ఉండి తమ సమస్యలపై పోరాడాలని తెలిపారు. రానున్న రోజుల్లో అన్ని రంగాల్లో యాదవులు ముందంజలో ఉండేలా ప్రతీ ఒక్క యాదవుడు కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనంతరం శ్రీకృష్ణ యాదవ సేన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కాసాని మురళి యాదవ్, ప్రధాన కార్యదర్శి డ్యాగ ఉదయ్ యాదవ్, కోశాధికారిగా యర్రం రాజు యాదవ్, ఉపాధ్యక్షులుగా సుధాకర్, సహకార్యదర్శిగా మురళి, కోశాధికారిగా ఆవుల ఉపేందర్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

చిన్నగూడూరు ఎంపీడీవోగా సుజాత



ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న సుజాత

చిన్నగూడూరు (మరిపెడ), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : చిన్నగూడూరు మండల్ పరిషత్ అభివృద్ధి అధికారిగా సుజాత సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో కిన్నెర యాకయ్యను నర్సింహులపేట మండల్ పరిషత్ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. సుజాత గ్రూప్ 1 ద్వారా ఎంపీడీవోగా ఎంపికయ్యారు. తొలి పోస్ట్ చిన్నగూడూరు ఎంపీడీవోగా జిల్లా కలెక్టర్ నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో సుజాతను మండల్ పరిషత్ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

నెల్లికుదురు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : యాంత్రీకరణ పరికరాల కోసం ఈ నెల 30 వరకు రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జి మండల వ్యవసాయ అధికారి మహేందర్ తెలిపారు. వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ 191 బ్యాటరీ స్ప్రేయర్లు, 35 పవర్ స్ప్రేయర్లు, 20 ట్రాక్టర్ పనియుట్లు, 14 రోటోవేటర్లు, 3 బ్రష్‌కటర్‌లు , 2 పవర్‌టిల్లర్‌లు, 2 స్ట్రాబెలర్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీరైతులకు జనరల్ మహిళ రైతులకు 50శాతం సబ్సీడీ మిగిలిన రైతులకు 40శాతం సబ్సీడీ పై అందజేయనున్నట్లు తెలిపారు. రైతులు తమ అదార్‌కార్డు పట్టాదారు పాస్‌పుస్తకం తో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

టీబీ వ్యాధిని ముందస్తుగా గుర్తించాలి

● డీఎంహెచ్‌వో రవిరాథోడ్



మానుకోటలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవిరాథోడ్

నెహ్రూసెంటర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : టీబీ వ్యాధిని ముందస్తుగా గుర్తించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎం అండ్‌హెచ్‌వో) బి.రవిరాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎంఅండ్ హెచ్‌వో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన టీబీ నిర్ధారణ పరీక్షల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీబీ వ్యాధిని అరికట్టడంలో భాగంగా 2025 వరకు టీబీ రహిత జిల్లాగా నిర్మాణం చేయడం కోసం అందరూ కలిసి పని చేయాలని సూచించారు. టీబీ మందులు వాడుతున్న కుటుంబసభ్యులకు ఇగ్రా పరీక్షలు చేయడం ద్వారా ముందస్తు టీబీని గుర్తించి, టీబీ ఇన్‌ఫెక్షన్ ఉన్న వారికి మందులు అందించాలని సూచించారు. టీబీ పట్ల ప్రతీ ఒక్కరు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరముందని తెలిపారు. బలమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీబీ ప్రోగ్రాం అధికారి విజయ్‌కుమార్, ల్యాబ్ టెక్నిషియన్లు, నర్సింగ్ ఆఫీసర్స్, టీబీ వ్యాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎస్సై ప్రమోద్‌కుమార్



ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ కలిసిన ఎస్సై ప్రమోద్‌కుమార్

పెద్దవంగర, అక్టోబరు 27: (ఆంధ్రజ్యోతి):పెద్దవంగర ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన చిలువేరు ప్రమోద్‌కుమార్ సోమవారం జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ వ్యాపారాలు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

గూడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ యాంత్రీకరణ సబ్సిడీ పనిముట్ల కోసం ఈ నెల 30లోగా అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి అబ్దుల్‌మాలిక్ తెలిపారు. గూడూరులో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాటరీ స్ప్రేయర్లు-158, పవర్ స్ప్రేయర్లు-29, ట్రాక్టర్ పనిముట్లు, సీడ్‌కం డ్రిల్-2, రోటోవేటర్లు-11, బ్రష్ కటర్స్-2, పవర్ వీడర్లు-1, స్ట్రాబేలర్-2 అందుబాటులో ఉన్నాయని, ఈ పనిముట్లను సబ్సిడీపై పొందేందుకు క్లస్టర్ వ్యవసాయ విస్తీర్ణ అధికారులను సంప్రదించాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ రైతులతో పాటు జనరల్ మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ, ఇతరులకు 40 శాతం సబ్సిడీపై పరికరాలు అందించనున్నట్లు చెప్పారు. అప్లికేషన్ ఫారంతో పాటు రైతు ఆధార్‌కార్డు, పట్టాపాస్‌బుక్, ఇతర అవసరమైన పత్రాలు జతచేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం



కోమట్లగూడెంలో మాట్లాడుతున్న రమేష్

గంగారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ వ్యవస్థపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.రమేష్ ఆరోపించారు. సోమవారం గంగారం మండలంలోని పలు పాఠశాలలను ఆయన సందర్శించారు. పాఠశాల వసతులపై, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన వివరాలు సేకరించిన అనంతరం కోమట్లగూడెం పాఠశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. వివిధ రకాల యాజమాన్యాల క్రింద నడుస్తున్న పాఠశాలకు కనీస వసతులను కల్పించకుండా కొత్తపేర్లతో మరిన్ని బడులు ఏర్పాటును ఆయన తప్పుపట్టారు. ఉపాధ్యాయులు బోధనపై పూర్తి శ్రద్ధపెట్టకుండా వివిధ సమస్యలను సృష్టిస్తున్నారని ఆరోపించారు.

పెండింగ్‌లో ఉన్న డీఏ బిల్లులు విడుదల చేసి, పీఆర్సీ విడుదల చేసి ప్రభుత్వం హామీలు నిలబెట్టుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లెల సాంబయ్య, వీరస్వామి, శ్రీకళ, సూర్యనారాయణ, సైదులు సాహెదా, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

బీఎస్పీ మండల అధ్యక్షుడు అజ్మీరా వెంకన్న



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న

గార్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీసీ కులాలకు కాంగ్రెస్ ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లు అమలు చేసి, తీరాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు అజ్మీరా వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం గార్లలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాజీ ముఖ్యమంత్రి మాయావతి ఆదేశాల మేరకు నవంబర్ 1న హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో మధ్యాహ్నం 12గంటలకు చేపట్టే ధర్నాకు బీసీ పెద్దలు అధిక సఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న బీసీ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉదృతం చేయడం కోసం బీఎస్పీ ముందకు సాగుతుందన్నారు. ఈసమావేశంలో మండల బీసీ నాయకులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం

- లారీని ఢీకొట్టిన బైక్..
- యువకుడి మృతి.. మరో యువకుడి పరిస్థితి విషమం
- ఆర్టీసీ కాలనీ వద్ద ప్రమాదం





ప్రమాదంలో మృతి చెందిన సంజయ్, తీవ్రంగా గాయపడిన ప్రసాద్

లింగాలఘణపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యూటర్న్ తీసుకుంటున్న లారీని బైక్ ఢీకొట్టడంతో యువకుడు దుర్మరణం చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నెల్లుట్ల గ్రామ శివారు ఆర్టీసీ కాలనీ వద్ద జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... రఘునాథపల్లి మండలం కంచనపల్లికి చెందిన రాగి వెంకటయ్య, మల్లమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్నకుమారుడు రాగి సంజయ్(19), లింగాలఘణపురం మండలం నవాబుపేటకు చెందిన ప్రసాద్ ఇద్దరు స్నేహితులు. వీరు జనగామలో డిగ్రీ మొదటి సంవత్సరం చదవుతున్నారు. ఇద్దరు నెల్లుట్ల నుంచి జనగామకు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై అతివేగంగా వస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి వస్తున్న లారీ సూర్యాపేట వైపునకు వెళ్లేందుకు ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డు మీదుగా వచ్చి యూటర్న్ తీసుకుంటున్నారు. బైక్ నడుపుతున్న సంజయ్ అతివేగంగా వస్తూ లారీని గమనించక బలంగా ఢీకొట్టాడు. హెల్మెట్ లేకపోవడంతో సంజయ్, ప్రసాద్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఆస్పత్రికి తరలిస్తుండగా సంజయ్ మృతి చెందాడు. ప్రసాద్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. హెల్మెట్ ధరించి ఉంటే సంజయ్ బతికేవాడని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

స్పందించని వాహనదారులు..

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించేందుకు పోలీసులు వాహనదారులను బతిమిలాడినా ఏ ఒక్కరూ స్పందించకపోవడం బాధాకరం. ఘటనా స్థలానికి జనగామ జిల్లా ఆస్పత్రి మూడు కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంది. అయితే ప్రమాదం జరిగిన సమయంలో 108 అంబులెన్స్ ప్రమాద స్థలానికి 11 కిలోమీటర్ల దూరంలో ఉందని సమాచారం అందుకున్న పోలీసులు అంబులెన్స్ రావడానికంటే ముందే ఆస్పత్రికి బాధితులను తీసుకెళ్లేందుకు అటుగా వచ్చే కార్లను, ఆటోలను, ఇతర వాహనదారులను ఎంత బతిమిలాడినా ఎవరూ స్పందించలేదు.

జ్వరంతో మహిళ మృతి

బయ్యారం, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి) : జగ్గుతండాలో సోమవారం జ్వరంతో వివాహిత మహిళ చల్లా రమాదేవి (30) మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వారం రోజులుగా ఆమె జ్వరం రాగా, మహబూబాబాద్ ఆస్పత్రిలో చికిత్స చేయించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

'తాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి'

గూడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరి కోసే సమయంలో తాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు అన్నారు. గూడూరు రైతు వేదికలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, హార్వేస్టర్ యాజమానులతో సోమవారం సమావేశం నిర్వహించారు. వరికోతకు వచ్చిన తర్వాతనే వరిని కోయాలని పేర్కొన్నారు. తేమశాతం 18 నుంచి 20 శాతం వరకు ఉన్నప్పుడు మాత్రమే వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని చెప్పారు. తాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమా వేశంలో తహసీల్దార్ నాగభవాని, ఏవో అబ్దుల్ మాలిక్, ఎస్సై గిరిధర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ విస్తీర్ణ అధికారులు, గ్రామపరిపాలన అధికారులు పాల్గొన్నారు.

వేబ్రిడ్జి ఇండికేటర్ సీజ్



గూడూరులో వేబ్రిడ్జిని తనిఖీ చేస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారి శ్రీలత

గూడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తూకంలో తేడా వస్తుందన్న ఫిర్యాదు మేరకు గూడూరులోని ఓ వేబ్రిడ్జిని జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి శ్రీలత సోమవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ వేబ్రిడ్జిలో కొలతలో టన్నుమేర తేడా వస్తుందన్న నమ్మదగిన సమాచారం మేరకు తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. వేబ్రిడ్జిపై లారీని పెట్టి డైరెక్షన్స్ మార్చుకుంటూ ఫోర్ కార్నర్స్ పెట్టి తనిఖీ చేసినట్లు చెప్పారు. తూకంలో తేడా టన్ను మేర వస్తుందని, బాధ్యులైన వేబ్రిడ్జి యాజమానిపై కేసు నమోదు చేసి, ఇండికేటర్ సీజ్‌చేసి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



పవన్ (ఫైల్)

నెల్లికుదురు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కాస్యతండా శివారు నద్యాతండాలో సోమవారం రాత్రి జరిగింది. ఎస్సై రమేష్ బాబు కథనం ప్రకారం. బానోత్ పవన్ (20) తన తండ్రి బానోత్ చంద్రు గత సంవత్సరం మృతి చెందాడు. తల్లి కమిలి ముగ్గురు అక్క లు ఉండటంతో కుటుంబ భారం అతడిపై పడింది. అప్పటి నుంచి పవన్ గ్రీన్‌ఫీల్డ్ హైవే కంపెనీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. గత నాలుగు రోజులుగా పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. పనికి ఎందుకు పోవడంలేదని, డబ్బులు లేకుంటే ఎలా బతుకాలని తన తల్లి కమిలి మందలించడంతో మనస్తాపంచెంది, ఇంట్లో ఉన్న చీరతో ఉరివేసుకుని మృతి చెందాడు. మృతిడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై రమేష్‌బాబు పేర్కొన్నాడు.



వరంగల్ ఎస్ఆర్ఆర్ తోటలోని ఓడీసీఎమ్మెస్ కార్యాలయ భవనం

ఓడీసీఎమ్మెస్ కనుమరుగేనా?

సహకార రంగంలో నాలుగు దశాబ్దాల ప్రస్థానం

- అన్నదాతలకు అండగా విలువైన సేవలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ. 200 కోట్ల ఆస్తులు
- ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన సొసైటీ
- ప్రభుత్వ విలీన నిర్ణయం పట్ల రైతుల్లో ఆందోళన

హనుమకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : నాలుగు దశాబ్దాల చరిత్ర కలిగిన ఓరుగల్లు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (ఓడీసీఎంఎస్) త్వరలో కనుమరుగు కానున్నదా ? సహకార రంగంలో తనదైన ప్రత్యేకతను నిలుపుకుంటూ లక్షలాది మంది రైతులకు సేవలు అందించిన ఈ సొసైటీ తన ఉనికిని కోల్పోనున్నదా ? ఉమ్మడి వరంగల్ జిల్లాలో విశిష్టమైన చారిత్రక నేపథ్యాన్ని కలిగిన ఓడీసీఎంఎస్ ఒకప్పుడు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబి)తో సమానంగా పోటీ పడింది. డీసీసీబీ అన్నదాతలను రుణాల పరంగా ఆదుకుంటే డీసీఎంఎస్ ఎరువులు, విత్తనాలను అందజేయడం, పంట ఉత్పత్తులను మద్దతు ధరకు కొనుగోలు చేయడం ద్వారా వెన్నుదన్నుగా నిలిచింది. ఓడిసిఎమ్మెస్ ఒక దశలో ఒక వెలుగు వెలిగింది. రాజకీయ నాయకులు ఓడీసీఎంఎస్‌కు చైర్మన్‌గా ఉండడం గొప్ప గౌరవంగా భావించేవారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఓడీసీఎంఎస్‌కు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ. 200 కోట్లకుపైగా ఆస్తులుఇప్పటికీ ఉన్నాయంటే ఈ సంస్థ గత ప్రాభవం ఏమిటో, సహకార వ్యాపార రంగంలో అది నిర్వహించిన క్రియాశీల భూమిక ఏమిటో అర్థం చేసుకోవచ్చు. రైతుల దగ్గర నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లింగ్ చేయడానికి జిల్లా చరిత్రలో తొలి సారి రైస్ మిల్లును సమకూర్చుకున్న ఘనత దీనికి ఉంది. ధాన్యాన్ని మరాడించి బియ్యాన్ని సరఫరా చేయడం ద్వారా అటు వ్యాపార పరంగా లాభాలు గడించడమే కాకుండా ఇటు రైతులను పరోక్షంగా ఆదుకున్న సహకార మార్కెటింగ్ సొసైటీ ఇది. మారిన పరి స్థితులు, సహకార రంగంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా తనను తాను నిలదొక్కుకోలేక క్రమంగా నష్టాల్లో కూరకుపోయి నప్పటి కీ తర్వాత నిలదొక్కుకొని తిరిగి లాభాల్లోకి రాగలిగింది. ప్రస్తుతం లాభాల బాటలో నడుస్తున్న ఓడీసీఎంఎస్ ప్రభుత్వం తీసుకోబోతున్న నిర్ణయంతో కాల గర్భంలో కలిసిపోనుండడం అన్నదాతలను ఆవేదనకు గురి చేస్తోంది.

విలీనం

వ్యవసాయ శాఖకు అనుబంధంగా ఉండి గుడిబండలా మారిన కార్పొరేషన్లను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చే చర్యల్లో భాగంగా కొన్నింటిని విలీనం, అవసరం లేనివాటి రద్దుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ ప్రక్రియలో ముందుగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఆగ్రోస్), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలు (డీసీఎమ్మెస్‌లు) కనుమరుగుకానున్నది.ఈ క్రమంలో ఓరుగల్లు జిల్లా సహకార మార్కెట్ సొసైటీ సైతం విలీనం ఖాయంగా కనిపిస్తోంది. విలీన ప్రక్రియకు ప్రతిపాదనలు పంపాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇటీవల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో డీసీఎమ్మెస్‌లు ఉన్నాయి. వీటి మూసివేతకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది.

గతంలోనే విలీనం ఆలోచన

ఆ తర్వాత ఓడీసీఎంఎస్ పుంజుకున్నది. స్వంతంగా వ్యాపార కార్యకలాపాలను నిర్వహించ సాగింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు (పీఏసీఎస్) పోటీగా మారింది. ఈ క్రమంలో పీఏసీఎస్‌ల మనుగడ కోసం ఓడీసీఎంఎస్‌తో పాటు మరికొన్ని డీసీఎంఎస్‌లను మార్క్‌ఫెడ్ లో విలీనం చేయాలనే ఆలోచన అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది. ఎందుకో ఆ తర్వాత ఇది ఆచరణలోకి రాలేదు. తాజా ఇప్పుడు మరో సారి విలీన ప్రతిపాదన తెరమీదికి వచ్చింది. రాష్ట్రంలో ఏవో కొన్ని డీసీఎమ్మెస్‌లు నష్టాల్లో నడుస్తున్నాయన్న, రైతులకు వాటి అవసరం లేదన్న కారణంతో ఓడీసీఎంఎస్‌తో సహా అన్నిటిని విలీనం చేయాలని నిర్ణయం తీసుకోవడం పట్ల రైతుల్లో వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. డీసీఎమ్మెస్‌లు మొదట్లో విత్తనాలు, ఎరువుల సరఫరా, పంటల కొనుగోళ్లు చేపట్టేవి. ఆ తర్వాత పౌరసరఫరాల సంస్థ ధాన్యంకు ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం అప్పగించింది. మార్క్‌ఫెడ్ మక్కలు, పప్పు ధాన్యాలు, నూనే గింజలు కొనుగోలు చేస్తోంది. దీంతో డీసీఎమ్మెస్‌లకు చైర్మన్లు, డైరెక్టర్ల నియామకం, గౌరవ వేతనం, వాహనాలు, ఇంటి అద్దెలు తదితరాలు చెల్లిస్తుండడంతో నిర్వహణ వ్యయం భారీగా పెరిగినందు వల్ల ప్రభుత్వ ఆదేశం మేరకు రాష్ట్ర సహకార శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. మిగతా డీసీఎమ్మెస్‌ల కన్నా ఓడీసీఎమ్మెస్ పరిస్థితి భిన్నం. దీని కింద ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ200 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. ఒక్క వరంగల్ ఎస్ఆర్‌తో టలోనే రెండెకరాల స్థలం ఉంది. దీని విలువనే రూ. 50 కోట్లకు పై చేస్తుంది. ఓడీసీఎమ్మెస్‌కు ప్రస్తుతం ఎలాంటి అప్పులు లేవు. 40 కేంద్రాల ద్వారా ఓడీసీఎమ్మెస్ ధాన్యం కొనుగోలు చేసి ప్రతీ సీజన్‌లో కమిషన్ రూపంలో సుమారు రూ 30 లక్షలు, ఎరువుల అమ్మకం ద్వారా రూ. 15లక్షల వరకు ఆదాయం ఆర్జిస్తోంది. ఈ సంస్థలో ప్రస్తుతం ఆరుగురు ఉద్యోగులు పని చేస్తున్నారు.

నలబై ఏళ్ళ క్రితం..

సహకార రంగంలో ఒకప్పుడు రెండంచెల వ్యవస్థ ఉండేది. రైతులకు పంటలు, వ్యవసాయ పని ముట్లు కొనుగోలు తదితర వాటి కోసం భూ తనఖా బ్యాంకులు (ఎల్ఎంబీ), ప్రాథమిక సహకార సంఘాలు (పీఏసీఎస్) ఉండేవి. ఎల్ఎంబీలు ఆ తర్వాత వ్యవసాయాభివృద్ధి బ్యాంకులుగా (ఎల్‌డీబీ) మారాయి. పీఏసీఎస్‌లు స్వల్పకాలిక రుణాలు ఇస్తే ఎల్ఎంబీలు దీర్ఘకాలిక రుణాలు ఇచ్చి రైతులను ఆదుకునేవి. తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి ముఖ్య మంత్రి ఎన్‌టీ రామారావు 1987లో సహకార వ్యవస్థలో సంస్కరణలను ప్రవేశపెట్టారు. ఏకగవాక్ష విధానం (సింగిల్‌విండో) తీసుకువచ్చారు. రైతులకు కావలసిన పంట రుణాలు, ఎరువులు, విత్తనాలు ఇతర ముడిసరుకుల పంపిణీ సింగిల్ విండో ద్వారానే జరిగేలా మార్పులు చేశారు. ఇందులో భాగంగా ఎల్ఎంబీలను డీసీసీబీలో విలీనం చేసి దీర్ఘ, స్వల్పకాలిక రుణాలను దీని ద్వారానే వితరణ జరిగేలా చూశారు. దీనితో మార్కెటింగ్ కార్యకలాపాలకు, పీఏసీఎస్‌లకు సంబంధం లేకుండా పోయింది. అప్పట్లో పాత తాలూకాల్లో ఉన్న సహకార మార్కెటింగ్ సొసైటీ (సీఎంఎస్)లను విలీనం చేసి జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లను ఏర్పాటు చేశారు. అలా మొదట్లో వరంగల్ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డబ్ల్యుడీఎమ్మెస్) ఏర్పాటయింది. డబ్లుడీఎమ్మెస్ తీవ్ర నష్టాల్లో కూరుకుపోవడంతో దానిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి లాభాల్లో ఉన్న వరంగల్, నర్సంపేట, మహబూబాబాద్ సీఎంఎస్‌లను విలీనం చేసి ఓరుగల్లు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (ఓడీసీఎమ్మెస్)గా మార్చారు. అలా 1987లో ఏర్పాటయింది. ఆ తర్వాత కాలంలో పరకాల సీమ్మెఎస్‌లు కూడా ఓడీఎఎమ్మెస్ పరిధిలోకి వచ్చాయి. జనగామ పీఏసీఎస్ ఆదీనంలోకి వెళ్లిపోయింది.

ఆస్తి కోసం బతికుండగానే చంపేశారు..

- తప్పుడు పత్రాలతో రూ.20కోట్ల ఆస్తి రిజిస్ట్రేషన్
- కలెక్టర్‌ను, పోలీసులను ఆశ్రయించిన వృద్ధుడు



రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద రిజిస్ట్రేషన్ పత్రాలు చూపిస్తున్న బాధితుడు

హనుమకొండ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి) : తండ్రి బతికుండగానే మరణించినట్లు తప్పుడు పత్రాలు చూపి ఆస్తిని తన వారసులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఓ తండ్రి అధికారులకు ఫిర్యాదు చేసిన ఘటన హనుమకొండలో చోటు చేసుకుంది. బాధితుడు సయ్యద్ జమాలొద్దీన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండకు చెందిన జమాలొద్దీన్‌కు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. జమాలొద్దీన్ వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. తనకు ఉన్న అపార్టమెంట్‌లలో ఫ్లాట్లు, ఇళ్ల, ఇంటి స్థలాలకు సంబంధించిన సుమారు రూ. 20 కోట్ల విలువైన ఆస్తులను గత సంవత్సరం 2024 మార్చి 18న తాను మరణించినట్లుగా చూపించి అప్పటి రిజిస్ట్రేషన్ అధికారి తప్పుడు పత్రాలతో తన ఆస్తిని కుమారుడు, కుమార్తెలు మోసపూరితంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వాపోయాడు. వృద్ధాప్యంలో తనను ఎవరు పట్టించుకుంటారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్‌ను కలిసి తన గోడు వెళ్లబోసుకున్నట్లు తెలిపారు. అనంతరం హనుమకొండ వడ్డెపల్లి రోడ్డులోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న పత్రాలతో ఆందోళన వెలిబుచ్చాడు.ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. 2025 మార్చి 26నసుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేసినా తనకు న్యాయం జరుగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో తనను పట్టించుకోని కూతుళ్ల, కుమారుడు రిజిస్ట్రేషన్ చేసుకున్న తన ఆస్తిని అధికారులు రద్దు చేసి తన ఆస్తి తనకు దక్కేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరాడు. భార్య అనారోగ్యంతో మృతి చెందగా రెండో వివాహం చేసుకున్నానని తెలిపారు.

కవి పొట్లపల్లికి నబారా స్మారక పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకుంటున్న పొట్లపల్లి శ్రీనివాసరావు

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కవి పోషకుడు, న్యాయవాది నమిలికొండ బాలకిషన్‌రావు జ్ఞాపకంగా ఏర్పాటు చేసిన నబారా పురస్కారం -2025ను ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాసరావు అందుకు న్నారు. శ్రీ రాజరాజ నరేంద్ర భాషా నిలయంలో జరిగిన కార్యక్రమంలో నబారా సొసైటీ అధ్యక్షులు నమిలికొండ పాంచాలరాయ్ అతిథు లు మధ్య పొట్లపల్లికి పురస్కారం అందజేశారు. తెలంగాణ రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, కవి బిల్ల మహేందర్ అధ్య క్షత వహించగా కవి, విమర్శకులు ఆచార్య బన్న అయిలయ్య మాట్లాడుతూ బాలకిషన్ రావు అనేక సాహితీ సంస్థలను ఏర్పాటుచేసి కవితా సంపుటాలను, సంకలనాలు ప్రచురించడమే కాకుండా ఎలాంటి లాభాపేక్ష లేకుండా ప్రసారిక అనే పత్రికను స్థాపించి ఎందరో కవులను ప్రోత్సహించారని అన్నారు. ప్రముఖ కవులు ఎన్‌వీఎన్.చారి, నిధిలు బాలకిషన్‌రావు, పొట్లపల్లి శ్రీనివాసరావు కవిత్వం, వారి వ్యక్తిత్వాలను సమగ్రంగా ఆవిష్కరించి కొనియాడారు. పొట్లపల్లికి నబారా పురస్కారంతో పాటు జ్ఞాపిక, శాలువ, రూ. 5116 నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు గిరిజా మనోహర్ బాబు, వీఆర్.విద్యార్థి, కవులు, పి.చందు, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, సముద్రాల శఠగోపాచార్యులు, మోత్కూరు మనోహర్, శర్మ, కోడం కుమారస్వామి, తాడిచెల్ల రవి, తదితరులు పాల్గొన్నారు.



మానవహారం చేస్తున్న విద్యార్థులు

స్కాలర్‌షిప్పులు వెంటనే విడుదల చేయాలి

కేయూ క్రాస్‌రోడ్డులో ఏబీవీపీ మానవహారం

కేయూ క్యాంపస్ అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం గత మూడేళ్లగా విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8500 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేస్తూసోమవారం కేయూ క్రాస్ రోడ్డు జంక్షన్‌లో ఏబీవీపీ నేతృత్వంలో నిరసనగా మానవహారం చేపట్టారు. ఫీజులు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీచేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర సెక్రటరీ మాచర్ల రాంబాబు, కేయూ అధ్యక్షుడు ఉబ్బటి హరికృష్ణ, పూర్వరాష్ట్ర కార్యదర్శి అంబాల కిరణ్, కేయూ ఇన్‌చార్జి నిమ్మల రాజేశ్, సెక్రటరీ జ్ఞానేశ్వర్, ఫణీంద్ర, శివ, అబి. మెరగు సాయికుమార్ పాల్గొన్నారు.

మహా జాతరకు సన్నద్ధం కావాలి

- ఏర్పాట్లను అధికారులు వేగవంతం చేయాలి
- భక్తులకు సౌకర్యాలు మెరుగపర్చాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



మేడారంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

తాడ్వాయి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మేడారం మహాజాతరకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ఏర్పాట్లను అధికారులు ప్రారంభించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. భక్తులకు సౌకర్యాలను మెరుగు పరుస్తూ మహాజాతరకు సన్నద్ధం కావాలని ఆదేశించారు. మంత్రి సీతక్క మేడారంలో సోమవారం సాయంత్రం పర్యటించారు. మేడారంలో జరుగుతున్న వనదేవతల దేవస్థానం పునరుద్ధరణ పనులను ఎస్పీ శబరీశ్, ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. వందల ఏళ్ల నిలిచేలా శాశ్వత పనులను ప్రభుత్వం చేపడుతున్న నేపథ్యంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

ఏర్పాట్లపై సమీక్ష

వనదేవతలను దర్శించుకున్న మంత్రి సీతక్క తల్లుల గద్దెలకు మొక్కులు చెల్లించుకున్నారు. పూజారులు తల్లుల ప్రసాదాలను మంత్రికి అందజేశారు. దేవస్థానం సమీపంలోని ఐటీడీఏ అతిథి గృహంలో ఏపీవో వసంతరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా జాతర ఏర్పాట్ల సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. జాతీయ రహదారులపై చేపట్టిన మల్లంపల్లి, కటాక్షపూర్ వంతెనల నిర్మాణాలను జాతరలోగా పూర్తి చేసి భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలను కల్పించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. అడవి ప్రాంతాల్లో విద్యుద్ధీకరణ మరమ్మతు పనులను చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులతో అన్నారు. అడవి ప్రాంతాల్లోని రహదారుల వెంబడి విద్యుత్ లైట్లు, సీసీ కెమెరాలు, నెట్‌వర్క్ టవర్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రత్యేక ఎల్‌టీ లైన్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతూ జంపన్నవాగులో భక్తులకు చేప ట్టాల్సిన బీవీటీ, బాతింగ్‌గాట్స్, సుందరీకరణ పనులు వెంటనే చేపట్టాలని అన్నారు. ప్రధానంగా పారిశుధ్య పనులపై పంచాయతీ రాజ్ అధికా రులు దృష్టి పెట్టాలన్నారు. మహా జాతరలో ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల భద్రత, ప్రమాదాల నివారణ ప్రోటోకాల్ దర్శనాలు, పార్కింగ్‌లు, రోడ్డు భద్రతా నియమాలు తదితర అంశాలపై ఎస్పీ శబరీశ్‌తో మంత్రి చర్చించారు. గతంలో మాదిరిగా కాకుండా దేవస్థానం సమీపం వరకు భక్తులు చేరుకునేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. మేడారంలో ప్రకృతి ప్రతి బించేలా స్మృతివనం, దేవస్థానం, జంపన్న వాగు, మూజియం పరిసరాల్లో వివిధ రకాల చెట్లను పెంచాలని దానికి అటవీ అధికారులకు సూచించారు. అనంతరం భూనిర్వాసితులతో మంత్రి సీతక్క సమావేశమయ్యారు. భూములు కోల్పోతున్న ప్రతి రైతుకూ న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేశ్, డీఎస్పీ రవీందర్, పూజా రుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ఔట్‌సోర్సింగ్' అక్రమార్కులకు చెక్

(5వ పేజీ తరువాయి)

వస్తున్నాయి. వరంగల్ ఎంజీఎంలో ఔట్‌సోర్సింగ్ విధానం అస్తవ్యస్తంగా మారింది. ఓ ఏజెన్సీ ఉద్యోగులు లేకున్నా ఉన్నట్లుగా రికార్డుల్లో బినామీ పేర్లను చేర్చి వేతనాల రూపంలో పెద్ద మొత్తంలో కాజేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఎంజీఎంలో వివిధ విభాగాల్లో పనిచేయకున్నా.. చేసినట్లుగా నకిలీ రికార్డులు తయారు చేశారనే ఆరోపణలు వినిపించాయి. ఆరు నెలల కిందట ఇదే విషయం తెలుకున్న అధికారులు.. సదరు ఏజెన్సీకి వేతనాల బిల్లులు ఇవ్వకుండా నెలల తరబడి నిలిపివేశారు. ఆ తరువాత తన పలుకుబడిని ఉపయోగించి నిలిపివేసిన వేతనాల బిల్లులను సదరు ఏజెన్సీ డ్రా చేసుకున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇక ఆయా శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులే బినామీ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీని రిజిస్ట్రేషన్ చేయించుకుని అక్రమ దందాకు దిగుతున్నారు. జనగామ మెడికల్ కాలేజీలో వైద్యశాఖ ఉద్యోగికి చెందిన బినామీ ఏజెన్సీకే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామకాలకు అవకాశం ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తుండటంతో ఏదో ఒకరోజు రెగ్యులర్ అవుతుందనే ఆశతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. నిబంధనల ప్రకారం ఆయా శాఖల్లో ఖాళీ అయినా పోస్టులను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాల్సి ఉంటుంది. అయితే చాలావరకు గుట్టు చప్పుడు కాకుండా ఏజెన్సీలు, సంబంధిత శాఖ అధికారులు కుమ్మక్కై, పోస్టులను బేరం పెట్టి, భర్తీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కోక్క పోస్టుకు రూ.2లక్షల నుంచి రూ.3లక్షలకు పైగా ఆయా ఉద్యోగాన్ని బట్టి కొన్ని ఏజెన్సీలు వసూళ్లు చేస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అయితే ఏళ్ల తరబడి చాలిచాలని వేతనాలతో ఉద్యోగం చేస్తున్నప్పటికీ పర్మినెంట్ కాకపోవటంతో మధ్యలోనే ఉద్యోగానికి బైబై చెబుతున్న వారు కూడా ఉన్నారు. ఇవే కాకుండా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రావాల్సిన పీఎఫ్‌లు, ఈఎస్ఐలు అందకుండా పోతున్నాయి. నిబంధనల ప్రకారం ప్రభుత్వం వేతనాలు ఇవ్వకపోయినా ఆయా ఏజెన్సీలే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ తదితర వాటిని చెల్లించాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలా ఏజెన్సీలు ప్రభుత్వం నుంచి నిధులు రావటం లేదని నెలల తరబడి వేతనాలు ఇవ్వటం లేదు. అంతేకాదు పీఎఫ్, ఈఎస్ఐ వంటివి కూడా చెల్లించటం లేదు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన పీఎఫ్‌లు కూడా ఏజెన్సీలు మాయం చేస్తున్నాయనే ఆరోపణలున్నాయి.

అక్రమార్కుల్లో గుబులు

ఔట్‌సోర్సింగ్ నకిలీలను ఏరివేసేందుకు అన్ని జిల్లాల్లో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను సేకరించాలని ప్రభుత్వం ఆయా శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. ఆయా శాఖల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆధార్ కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు పాస్ బుక్‌లు సేకరించాలని ఆదేశించింది. ఒక్కొక్క ఉద్యోగికి ఒక్కో యూనిక్ నెంబరు కేటాయించి నేరుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఖాతాలో వేతనం జమచేసే ప్రయత్నంలో ప్రభుత్వం ఉన్నట్లుగా సమాచారం. ఇంటిగ్రేటెడ్ ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం (ఐఎఫ్ఎంఐఎస్) పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ పోర్టల్‌లో నమోదు చేసిన ఉద్యోగులకే ప్రభుత్వం వేతనాలు ఇచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. దీంతో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల బినామీ దందాకు చెక్ పెట్టడంతో పాటు పని చేసే వారికే నేరుగా రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించనున్నారు. మరోవైపు ఇన్నాళ్లు బినామీ పేర్లతో.. తప్పుడు రికార్డులతో వేతనాలు మాయం చేసిన కొన్ని ఏజెన్సీల నిర్వాహకుల్లో గుబులు మొదలైంది.

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 25వేల మందికి పైగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు ఉండగా, వీరిలో ఎంతమంది నకిలీలు ఉన్నారనేది ఆసక్తికరంగా మారింది. అంతే కాకుండా ఎంతమంది బినామీ పేర్లతో సర్కారు సొమ్ముకు కన్నం వేశారో కూడా బయటకు రానుంది.

అకాల వర్షాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

- పంట నష్టం జరగకుండా చూడాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తుఫాను కారణంగా కురిసే అకాల వర్షాలతో పంట నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి పత్తి, ధాన్యం, మొక్క జొన్న వంటి పంటల కొనుగోలుపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, సీఎస్ కే రామక్రిష్ణారావు, ఇతర రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి ఉత్తమ్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే రెండు రోజుల పాటు తుఫాను ప్రభావంతో మన రాష్ట్రంలో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు. జిల్లాలో ఉన్న వరి, పత్తి, మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాల వద్ద నష్టం వాటిల్లకుండా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధం చేయాలని అన్నారు. నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం 100 శాతం ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరవాలని మంత్రి కలెక్టర్లను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతుల కొరత ఎక్కడైనా ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. పంట కొనుగోలు విషయంలో ఏ చిన్న తప్పు జరిగినా కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో రాబోయే రెండు రోజులు వర్షాలు పడే అవకాశం ఉన్నందు వల్ల పంట కోతలు వాయిదా వేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. కోతలు చేసిన మొక్కజొన్న, వరి వంటి పంటలు నాణ్యతా ప్రమాణాలు ఉంటే వెంటనే కాంటా వేసి కొనుగోలు చేయాలని, పంట తరలింపునకు వాహనాల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా రైతుల కల్లాల వద్ద తేమ శాతం పరిశీలించి నాణ్యత ప్రమాణాలు ఉంటేనే కొనుగోల కేంద్రాలకు పంట తీసుకొని వచ్చేలా చూడాలని అన్నారు. సీఎస్ కె. రామక్రిష్ణారావు మాట్లాడుతూ రాబోయే 45 రోజుల నుంచి రెండు నెలల కాలంలో ధాన్యం కొనుగోలు ఉధృతంగా జరుగనుందని, అధికారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ సజావుగా కొనుగోలు జరిగేలా చూడాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీవో మేన శ్రీను, డీసీవో సంజీవరెడ్డి, డీఏవో రవీంద్ర సింగ్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పరికరాల కోసం దరఖాస్తు చేసుకోండి

ఇనుగుర్తి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులు రాయితీపై వ్యవసాయ పరికరాల కోసం ఈ నెల 30 లోగా రైతువేదికలో ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, ఇతర అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని ఎంఏవో మహేందర్ సోమవారం కోరారు. మండలానికి 70 బ్యాటరీ స్ప్రేయర్లు, 13 పవర్ స్ప్రేయర్లు, 6 ట్రాక్టర్ పనిముట్లు, సీడ్‌కం ఫర్టీ డ్రిల్, 5 రోటవేటర్లు 5, ఒకటి చొప్పున పవర్ టిల్లర్, స్ట్రాబేలర్ మంజూరయ్యాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలతో పాటు మహిళా రైతులకు సగం, ఇతర రైతులకు 40 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. సంబంధిత ఏఈవోలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

హమాలీ, కూలీలకు రేట్లు పెంచాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న

కేసముద్రం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పనిచేసే హమాలీ, కూలీలకు కూలీ చార్జీలను పెంచాలని ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు కేసముద్రంలో సోమవారం తహసీల్దార్ వివేక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం కూలీరేట్లనే కార్మికులకు చెల్లిస్తున్నారని, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకనుగుణంగా చార్జీలను పెంచాలని కోరారు. ఆయన వెంట సకినాల నరేష్, భట్టు మురళి, కొమ్ము అనీల్, శ్రీను పాల్గొన్నారు.

మార్కెట్ కార్యదర్శిగా సుజన్‌బాబు



మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా (గ్రేడ్-1 ఎఫ్ఎసీ) వి.సుజన్ బాబు నియామకమయ్యారు. మహబూబాబాద్ మార్కెట్‌లో సోమవారం బాధ్యతలు చేపట్టారు. మంచిర్యాల జిల్లా లక్షెట్‌పేట్ నందు విధులు నిర్వహిస్తూ, బదిలీ ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన కార్యదర్శి శంషీర్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో సుజన్‌బాబు బాధ్యతలు చేపట్టారు.

'టీచర్లకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి'



ప్రాథమిక పాఠశాలలో వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

కేసముద్రం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అర్పనపల్లి, కేసముద్రం విలేజి ప్రాథమిక పాఠశాలల్లో సోమవారంభోజన విరామంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేందర్, నర్సింహరాజు మాట్లాడారు. బీఈడీ అర్హత ఉన్న ఉపాధ్యాయులకు టెట్ 1 రాసే అవకాశం లేదని తెలిపారు. ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించడమే దీనికి పరిష్కారమని తెలిపారు. కార్యక్రమంలో ఊట్కూరి ప్రణయ్‌కుమార్, అప్పాల నాగరాజు, భూక్య శ్రీనివాస్, నర్సింహస్వామి, ఏ.శ్రీదేవి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆల్ హమాలీ సంఘం జిల్లా కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న డిమాండ్ చేశారు. మహబూబాబాద్ వాసవీ కోల్డ్ స్టోరేజ్‌లో సోమవారం హమాలీ కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హమాలీ కార్మికుల కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో బానోత్ రవి, హేమానాయక్, లక్ష్మణ్, లాలు, సేవ్యా, నవీన్, మహేందర్, బాలు, లచ్చు, హరి, రాము, రాజు, వీరస్వామి, వెంకన్న, కొమురయ్య, చారి, ఐలయ్య, ముత్తయ్య, రాములు పాల్గొన్నారు.

కుమరం భీం వర్ధంతి



కుమరంభీం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అంబేద్కర్ యువజన సంఘం బాధ్యులు

ఇనుగుర్తి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ వీరుడు కుమరం భీం వర్ధంతిని ఇనుగుర్తి పెద్దబస్టాండ్ సెంటర్‌లో సోమవారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కుమరం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు పప్పుల వెంకన్న, మహంకాళి రామ్ సలీం, నాళ్ల మురళి, మారం రాము, ధీకొండ వెంకన్న, దార్ల రాంమూర్తి, గుజ్జునూరి బాబురావు, జాటోత్ హరిచంద్, చిన్నాల కట్టయ్య, పప్పుల వెంకన్న పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి సాయం

ఇనుగుర్తి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తిలో ఇటీవలె ఆత్మహత్య చేసుకున్న ఆలకుంట్ల రాజు కుటుంబానికి 2013-14 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన ఆయన స్నేహితులు రూ.11 వేలను సోమవారం అందజేశారు. షేక్ యాకూబ్ పాషా, జాటోత్ సంతోష్, ఆవుల రవిచంద్ర, గుండ్రపల్లి సాయికుమార్, రాకేష్ పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే

● బీఎస్పీ రాష్ట్ర నాయకు దార్ల శివరాజ్



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

నెహ్రూసెంటర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని బీఎస్పీ రాష్ట్ర నాయకుడు దార్ల శివరాజ్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం చలో హైదరాబాద్ పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు. ఎల్.విజయ్‌కాంత్, ఎడ్ల శ్రీను, గుగులోతు నరేష్, బోట్ల ప్రవీణ్ పాల్గొన్నారు.

విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

● టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఉపేందర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి) : విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాచకొండ ఉపేందర్ అన్నారు. మహబూబాబాద్‌లో నూనావత్ సుశాంత్ అధ్యక్షతన 18వ పీడీఎస్ యూ పట్టణ మహాసభను సోమవారంనిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో పాలకవర్గ పార్టీలు విద్యారంగాన్ని విస్మరిస్తున్నాయని, అందులో భాగంగానే విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయిస్తూ ప్రాథమిక విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో రోజురోజుకూ ప్రైవేటు విద్యాసంస్థలు పుట్టగొడుల్లా వెలుస్తుంటే, ప్రభుత్వ పాఠశాలలు మాత్రం మూతపడుతు న్నాయన్నారు. విద్యాప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం పీడీఎస్‌యూ పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా సుష్మత్, ఉపాధ్యక్షుడిగా ఎమ్డీ అసిఫ్, కార్యదర్శిగా ఎస్కె షబ్బీర్, సహాయ కార్యదర్శిగా బైరి దిలీప్, కోశాధికారిగా జస్వంత్‌తో పాటు మరో



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

నలుగురు సభ్యులతో కూడిన కమిటీని ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదారపు నాగరాజు, భువనగిరి మధు తెలిపారు. మునగాల మహేష్, భరత్, వికాస్, సంజయ్, రుతిక్‌పాషా, షబ్బీర్, భరత్ పాల్గొన్నారు.

మానుకోటను రోల్‌మోడల్‌గా నిలుపుదాం

(5వ పేజీ తరువాయి)

రాష్ట్రంలో నెంబర్ వన్ సిటీగా నిలుపుతామని చెప్పారు. తొలుత30వ వార్డులో రూ.20 కోట్లతో చేపట్టే తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మదన్‌గోపాల్‌లోయా, కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖలీల్ పాషా, మాజీ జడ్పీటీసీ జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్‌నాయక్, నీరుటి లక్ష్మీనారాయణ, ఎడ్ల రమేష్, రామగోని రాజు, పోతురాజు రాజు, ఎమ్డీ. హరుణ్, నీరుటి సురేష్‌నాయుడు, శ్రీను, బెల్లంకొండ శ్రీనివాస్, నాళ్ల లక్ష్మీనర్సింహారావు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉపేందర్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సరుకులను రవాణా చేస్తున్న, ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చే రవాణారంగ కార్మికుల కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో సోమవారం సీఐటీయూ అనుబంధ తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్‌యూనియన్ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన కుంట ఉపేందర్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లెబర్‌కోడ్‌లను తీసుకువచ్చిందని విమర్శించారు. పని గంటలు పెంచడం, హక్కులను హరించి వేసి కార్మికులను కట్టుబానిసలుగా మార్చిందని దుయ్యబట్టారు. కార్మిక



మహాసభలో మాట్లాడుతున్న కుంట ఉపేందర్

హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కన్వీనర్‌గా సమ్మెట రాజమౌళితో పాటు 17 మందితో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో తోట శ్రీనివాస్, పాలబిందెల మల్లయ్య, మధు, సింహాద్రి, శ్రీనివాస్, ఆజాద్, చిన్నా, భద్రయ్య, లింగన్న, కొండయ్య, యాకూబ్, చంద్రశేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

'యాదగిరి సేవలు మరువలేనివి'

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టులో న్యాయవాదిగా సేవలందించి అనారోగ్యంతో మృతి చెందిన వల్లపు యాదగిరి సేవలు మరువలేనివని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రేమ్‌చందర్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కోర్టులో సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి, యాదగిరి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌చందర్ మాట్లాడుతూ వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేటకు చెందిన వల్లపు యాదగిరి గత ఇరవై సంవత్సరాల నుంచి మహబూబాబాద్ కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తూ పోడు రైతులకు పట్టాలు ఇప్పించడంలో కీలకపాత్ర పోషించారని చెప్పారు. సమావేశంలో న్యాయవాదులు సిద్ధు, కొండపల్లి కేశవరావు, చలపతిరావు, మామిడాల సత్యనారాయణ, తుంపిళ్ల శ్రీనివాస్, జి.వై. గిరి, తోర్నాల నాగేష్, రవికుమార్, బుర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.



యాదగిరి సంతాప సభలో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రేమ్‌చందర్

రైతులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రెండు రోజుల్లో వాతావరణ సూచనల మేరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, సామాన్య ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయం నుంచి వ్యవసాయ, నీటి పారుదల, రెవెన్యూ, పంచాయతీ రాజ్, సంబంధిత అధికారులతో సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం నష్టం కాకుండా తరలింపు, ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులను తెలియజేస్తూ అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు. ఇప్పటికే జిల్లాలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంచాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు స్థానికంగా ఉంటూ ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరు సమన్వయంతో పని చేస్తూ ధాన్యం, పత్తి తదితర పంటలు, ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్, ఆర్డీవోలు గణేష్, కృష్ణవేణి పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాస్‌లైన్ కొత్తపల్లి రవి

సభలను జయప్రదం చేయండి

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : భారత విప్లవోద్యమంలో తమ అమూల్యమైన ప్రాణాలర్పించిన విప్లవీరులను స్మరించుకుంటూ నవంబరు 1వ తేదీ నుంచి 7 వరకు నిర్వహించే అమరవీరుల సంస్మరణ సభలను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని ఆ పార్టీ కార్యాలయం ఎదుట సంస్మరణ సభల కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్టడుగు వర్గాలైన దళితులు, ఆదివాసీలు, గిరిజనులు, బడుగు, బలహీనవర్గాల ప్రజలపై సాగుతున్న పీడన, దోపిడి, అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడి ఎంతోమంది నేలకొరిగారని చెప్పారు. వారిని స్మరించుకుంటూ నిర్వహించే సంస్మరణ సభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మగాని సత్యం, ఎమ్డీ పాష, రాందాస్, రాంబాబు, అనిల్, పూల్‌సింగ్, పవన్ పాల్గొన్నారు.

'సమాజంలో వైద్యవృత్తికి అపార గౌరవం ఉంది'

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో వైద్యవృత్తి అంటే అపారమైన గౌరవం ఉందని, వైద్యవిద్య పూర్తయ్యాక ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు కృషి చేయాలని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ సూచించారు. మహబూబాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సోమవారం 2025-26 ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థుల వైట్‌కోట్ శర్మనీ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ నేటి ఎంబీబీఎస్ విద్యార్థులు.. రేపటి వైద్యులని.. వారంతా పట్టణాలకే పరిమితం కాకుండా మారుమూల గ్రామాలకు వైద్య సేవలు విస్తరించేలా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లాకవత్ వెంకట్‌నాయక్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థులతో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



రిలే దీక్ష చేస్తున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

నిందితులను అరెస్ట్ చేయాలని

కాంగ్రెస్ నాయకుడి రిలే దీక్ష

బయ్యారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తనపై హత్యాయత్నం చేసిన కేసులో నిందితులను అరెస్ట్ చేయాలనే డిమాండ్‌తో బయ్యారంలో సోమవారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నాయిని శ్రీనివాస్‌రెడ్డి రిలే నిరాహార దీక్షకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై గత నెల 21న పలువురు తమ పార్టీకి చెందిన పలువురు హత్యాయత్నానికి పాల్పడ్డారని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ నిందితులను అరెస్ట్ చేయకుండా పోలీసులు జాప్యం చేస్తున్నారని, స్థానిక ఎమ్మెల్యే స్పందించడంలేదని ఆరోపించారు. ఈ దీక్షకు మద్దతుగా గోవర్ధన్ కూడా ఆయన వెంట కూర్చున్నారు. ఇదిలా ఉండగా అధికార పార్టీకి చెందిన నాయకుడే దీక్షకు దిగడంపై రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

రైతులకు మౌలిక వసతులు కల్పించాలి

డోర్నకల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మండలంలో పీఏసీఎస్, సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబోయే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని మండల ప్రత్యేక అధికారి నర్సింహామూర్తి ఆదేశించారు. సోమవారం డోర్నకల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సెర్ప్ సిబ్బంది, పీఏసీఎస్ బాధ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ప్రతీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ప్యాడీ క్లీనింగ్ మిషన్‌ను తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. రైతులు ధాన్యం ఆరబెట్టుకునేందుకు తగిన టార్పాలిన్‌తో పాటు గన్నీ బ్యాగులను అందించాలన్నారు. కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం మద్దతు ధరకు సంబంధిత వివరాలను రైతులకు అర్థమయ్యే విధంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ, పోలీస్, వ్యవసాయశాఖ సిబ్బంది కొనుగోలు కేంద్రాలను సందర్శించి ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయలన్నారు. తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్, మండల వ్యవసాయాధికారి మురళీమోహన్, సీఐ చంద్రమౌళి, డోర్నకల్, మన్నెగూడెం పీఏసీఎస్ సీఈవో సతీష్, డోర్నకల్ సెర్ప్ ఏపీఎం పాపయ్య, సీసీలు రాధ, సౌందర్య, ఏఈవోలు అవినాష్, చరణ్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి నర్సింహామూర్తి

జీవితాంతం ప్రజల కోసం పని చేసిన సత్యనారాయణ

● తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమక్క

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తన జీవితాంతం ఎర్ర జెండా నీడలో జానపద కళాకారుడు, తెలంగాణ ఉద్యమకారుడు భూక్య సత్యనారాయణ ప్రజల కోసం పని చేశారని తెలంగాణ ప్రజాఫ్రంట్ (టీపీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమక్క అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని కృష్ణకాలనీలో భూక్యసత్యనారాయణ సంస్మరణ సభను చిత్తారి సోమన్న అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హాజరైన టీపీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమాదేవి మాట్లాడుతూ తాను నమ్మిన సిద్ధాంతాన్ని జీవితాంతం ఆచరించి ఆచరణాత్మక కమ్యూనిస్టుగా జీవించిన గొప్ప వ్యక్తి సత్యనారాయణ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు జంపాల విశ్వ, చిర్ర రవి, దేవిరెడ్డి విజయ్, సంజీవరావు, కొత్తపల్లి రవి, ఫైన శ్రీనివాస్, లింగన్న, సైదులు, కొమిరె వెంకన్న, రాజమౌళి, నరేందర్, అశోక్, వెంకటేశ్వర్లు,చందులాల్, పరికిపండ్ల అశోక్, ఐలేష్, వెంకట్రావు, రమేష్, సీతాదేవి, విక్రమ్, విశాల, విమల పాల్గొన్నారు.

బావికి రక్షణగా పెట్టిన ఇనుప స్తంభాలు చోరీ

కురవి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కురవి-ఖమ్మం ప్రధాన రహదారిపై కురవి శివారులో రోడ్డుపక్కన ప్రమాదకరంగా వ్యవసాయ బావి ఉంది. గతంలో ప్రమాదవశాత్తు ఆ బావిలో ఎవరు పడిపోకుండ ఉండేందుకు ఎన్‌హెచ్ అధికారులు బావి చుట్టు రక్షణగా గోడను నిర్మించారు. అయితే ప్రస్తుతం ఆ గోడ నిర్మాణం మొత్తం ధ్వంసమై కూలిపోయింది. ఇటీవలి కాలంలో తరుచుగా రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావి వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఓ ద్విచక్రవాహనదారుడు సైతం మృతి చెందాడు. ఎన్నిసార్లు ఎన్‌హెచ్ అధికారులకు విన్నవించిన పట్టించుకోకపోవడంతో బావి యాజమాని నూతక్కి నర్సింహరావు ఇటీవల 12 ఇనుప స్తంభాలు, మూడు రాతి స్తంభాలు తెప్పించి బావిలో వాహనదారులు, ఎవరు పడిపోకుండా రక్షణగా ఏర్పాటు చేశారు. అయితే సోమవారం తెల్లవారుజామున దొంగలు 12 స్తంభాలు ఎత్తుకెళ్లారు. దీంతో రహదారి పక్కన వ్యవసాయ బావి మళ్లీ ప్రమాదకరంగా మారింది. ఎన్‌హెచ్ అధికారులు ఇప్పటికైన స్పందించి బావిలో ఎవరు పడిపోకుండ రక్షణ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

లక్కీచాన్స్

(5వ పేజీ తరువాయి)

గుండ్లపల్లి వెంకటేశ్వర్లు-4, సుద్దాల సిరిచందన-5, ఎన్.దేవేందర్‌రెడ్డి-6, చల్లా సారయ్య-7, బోగోజు వేణుగోపాలచారి-8, బోయినపల్లి వెంకటేష్-9, బోనగిరి సుభద్రాదేవి -10, వెంపటి లక్ష్మీనారాయణరావు-11, గొట్ల రాకేష్ యాదవ్-12, పేరాల జంపన్న-13, నల్లు రజిత- 14 దుకాణాలను దక్కించుకున్నారు. డోర్నకల్ మునిసిపాలిటీ పరిధిలోని ఎన్.శ్రీవాణి-1, బి.వెంకట్‌రెడ్డి-2, ఎన్.శ్రీవాణి-3, కురవి విలేజ్ పరిధిలోని ఎడెల్లి నరేష్-1, కతుర రాజేందర్-2, నాతి ఉమామహేశ్వరి-3, ముల్కలపల్లి (వీ) ఎ.శ్రీవాణి-1, కసనబోయిన ఉపేందర్-1 షాపులను దక్కించుకున్నారు.

తొర్రూరు మునిసిపాలిటీ పరిధిలోని భూసాని శ్రావణి షాపు-1, బండారి యాకయ్య-2, భూసాని పండు-3, గాజుల లక్ష్మయ్య-4, జంగిలి వేణు-5, పుప్పాల శివ-6, భూపతి సవీందర్-7, కోల రాజేష్-8, మరిపెడ మునిసి పాలిటీ పరిధిలోని గొట్ల వెంకటేశ్వర యాదవ్-1, గంధసిరి అంబరీష -2, కె.శివకోటేశ్వర్‌రావు-3, మాసబత్తిని సతీష్-4, ఎడుమూరి సోమిరెడ్డి -5, నర్సింహులపేట విలేజ్ పరిధిలో గొల్లపల్లి వెంకన్న-1, రేఖ నర్సయ్య-2, నెల్లికుదురు పరిధిలో సుధగాని మమత-1, పెరుమాండ్ల రాము-2, పల్లె రోషిణి-3, దంతాలపల్లి విలేజ్‌పరిధిలో బోగుళ్ల నాగేంద్ర-1, రావుల అనూష -2, పెద్దవంగర విలేజ్ పరిధిలో ముచ్చింతల లక్ష్మీ -1, చిన్నగూడూరు విలేజ్ పరిధిలో తోకల నవీన్-1 దుకాణాలు దక్కాయి.

కేసముద్రంమునిసిపాలిటీ పరిధిలో కర్నం కుమార్ షాపు-1, గుతుప రమేష్-2, మడ్డి రవీందర్-3, బి.రమేష్-4, ఇనుగుర్తి విలేజ్‌పరిధిలో మెరుగు ఉపేందర్-1, గుండెంగ విలేజ్ పరిధిలో కాగు శ్రీలత-1, బయ్యారం విలేజ్ పరిధిలో వాసం సాంబయ్య-1, పోలెబోయిన అరుణకుమారి-2, జగ్గుతండా జీపీపరిధిలో బోడ రవి-1, గార్ల విలేజ్ పరిధిలో చట్ల వెంకన్న, చట్ల వెంకన్న-2, గూడూరు విలేజ్ పరిధిలో ఈక రాజేశ్వర్-1, కుంజ రాకేష్-2, జజ్జరి కిరణ్-3, కొత్తగూడ విలేజ్ పరిధిలో చట్ల నాగార్జున-1, ఈక వీరస్వామి -2, గంగారం విలేజ్ పరిధిలో ఈసం సారయ్య-1 షాపులను దక్కించుకున్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బాదావత్ కిరణ్‌నాయక్, సీఐలు చిరంజీవి, నాగేశ్వర్‌రావు, బిక్షపతి, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.